హెచ్చరిక బోర్డూ తీసేశారు


మధురవాడ శ్రీలక్ష్మీనగర్‌లోని ప్రభుత్వ భూమిలో వీఆర్‌వో, రెవెన్యూ సిబ్బంది ఆదివారం ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు


శ్రీలక్ష్మీనగర్‌లో సోమవారం సాయంత్రానికి హెచ్చరిక బోర్డు మాయమైన దృశ్యం

- మధురవాడ శ్రీలక్ష్మీనగర్ సర్వే నంబరు 27లో ఆగని ఆక్రమణపర్వం
- పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్న వీఆర్‌వో
- కోట్ల రూపాయల ప్రభుత్వ భూమికి రక్షణ కరువు

మధురవాడ : తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు కూడా కాకముందే టీడీపీ నాయకుల అండదండలతో భూ అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ పేరుతో ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను కూడా అక్రమార్కులు వీకి మాయం చేసేసిన సంఘటన విశాఖ రూరల్ మండలం శ్రీలక్ష్మీనగర్‌లో చోటు చేసుకుంది. కొమ్మాది జంక్షన్ నుంచి శివశక్తినగర్‌కి వెళ్లే రోడ్డులో మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 27 శ్రీలక్ష్మీనగర్‌లో ప్రభుత్వ స్థలం వుంది. ఇక్కడ కొందరు వ్యక్తులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేరు చెప్పి జీవీఎంసీ 5వ వార్డుకు చెందిన టీడీపీ నాయకుల కనుసన్నల్లో సుమారు ఎకరం స్థలంలో 20కి పైగా రేకుల షెడ్లు నెలున్నర రోజులుగా నిర్మిస్తున్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్డుకి, వుడా ఏర్పాటు చేసిన ఎంతో విలువైన లే అవుట్ ఉన్న కొండ కింది భాగంలో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుంటే రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు కనీసం స్పందించడం లేదు. ఈ వ్యవహారంపై సాక్షి పత్రికలో మే 23న 'టీడీపీ నాయకుల అండతో దర్జాగా కబ్జా', జూన్ 25న 'నిరాటంకంగా ఆక్రమణ దందా' శీర్షికలతో వరుసగా కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ క్రమంలో ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు స్పందించి ఆదివారం సచివాలయ వీఆర్‌వో సువర్ణ ఆధ్వర్యంలో సిబ్బంది గుట్టుగా హెచ్చరిక బోర్డు పాతి వెళ్లిపోయారు. అయితే సోమవారం సాయంత్రానికే ఆ బోర్డు మాయమైపోయింది. ఇక్కడ కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నా... మండల రెవెన్యూ అధికారులకు చీమ కుట్టినట్లయినా లేకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తాం

ఈ సందర్భంగా గ్రేడ్ – 2 వీఆర్‌వో ఎస్.సువర్ణ మాట్లాడుతూ తాము ఇక్కడ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును ప్రభుత్వ భూమి ఆక్రమించి షెడ్లు నిర్మించిన వారు తీసేశారన్నారు. తాము ప్రభుత్వ భూమి పరిశీలన కోసం వెళ్తే కొందరు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని సువర్ణ చెప్పారు.

వ్యర్థాలు డ్రైనేజీల్లోకి వదిలితే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో ఆహార పదార్థాల వ్యర్థాలు, మాంసం, చేపల వ్యర్థాలు డ్రైనేజీలు, బహిరంగ ప్రదేశాల్లో విడిచి పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మినాయుడు హెచ్చరించారు. 'ఫుడ్‌కోర్టు వ్యర్థాలతో దుర్వాసన' శీర్షికతో గత నెల 30న సాక్షిలో ప్రచురించిన వార్తకు ఆయన స్పందించారు. శిథిలమైన డ్రైనేజీల్లోకి దేవి ఫుడ్ కోర్టు నుంచి వ్యర్థాలు వస్తున్నట్టు గుర్తించి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. మరోమారు ఇలాంటి వ్యర్థాలు రాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వీటి వల్ల చుట్టుపక్కల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. దీనికి సంబంధిత హోటళ్లు, ఫుడ్‌కోర్టుల యాజమాన్యాలే బాధ్యత వహించాల్సి వుంటుందని హెచ్చరించారు. అలాగే పారిశుధ్య సిబ్బంది డ్రైనేజీలు శుభ్రం చేసుకోలేని విధంగా రత్నా జ్యూయలరీ యాజమాన్యం డ్రైనేజీపై నిర్మాణాలు చేపట్టిందన్నారు. డ్రైనేజీలపై సిమెంట్ శ్లాబుతో కాకుండా ఐరన్‌తో తెరచుకునేలా మూతలు వేసుకోవాలని సూచించారు. డ్రైనేజీలపై ఆక్రమణలు టౌన్ ప్లానింగ్ విభాగం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇబ్బంది పడుతున్న మిగిలిన వ్యాపారులు కూడా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.


భీమిలి రోడ్డులోని డ్రైనేజీ నుంచి ఆహార వ్యర్థాలు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

క్లుప్తంగా

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

కొమ్మాది : జీవీఎంసీ 6వ వార్డు కే1 కాలనీ గ్రామ దేవతలు శ్రీ దుర్గాలమ్మ, శ్రీ ఎల్లమ్మ, శ్రీ నాగులమ్మ అమ్మవార్ల మారువార మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లకు పసుపు, కుంకుమ సమర్పించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ పైడిరాజు, కాలనీ ప్రెసిడెంట్ అవతార్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహకారం అందజేత


నగదు అందిస్తున్న సంఘం సభ్యులు

కొమ్మాది : గత నెల 12న పాడేరు ఘాట్ రోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో శ్రీ మరిడిమాంబ సౌండ్ సిస్టమ్స్‌లో పనిచేసే నలుగురు యువకులు చనిపోగా 8 మంది చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో భీమిలి బీచ్ రోడ్డు శ్రీ దుర్గాదేవి సప్లయర్స్, లైటింగ్, సౌండ్స్, కేటరింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున రూ.20 వేల ఆర్థిక సహకారాన్ని బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్లాజీ, శివకుమార్, నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

సీడ్ బాల్స్ తయారీ


సీడ్ బాల్స్ తయారు చేస్తున్న విద్యార్థులు

భీమునిపట్నం : భీమిలి సమీపంలోని కీతినపేట వద్దనున్న సన్ స్కూల్ విద్యార్థులు మంగళవారం పలు రకాల మొక్కలకు సంబంధించిన సీడ్ బాల్స్ (మట్టి విత్తన బంతులు) తయారు చేశారు. మిషన్ గ్రీన్ భీమిలి సంస్థ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సంస్థ సభ్యులు ముమ్మిడిశెట్టి ఆదిత్య, జి.వెంకటేష్ మాట్లాడుతూ వనం కోసం మనం – మన కోసం వనం అనే నినాదంతో సంవత్సరానికి లక్ష విత్తన బంతులు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. విద్యార్థుల సహకారంతో 25 కిలోల విత్తనాలతో 15 వేల సీడ్‌బాల్స్ తయారు చేస్తున్నామని తెలిపారు. వీటిని కొండ ప్రాంతాల్లో చల్లుతామని తెలిపారు.

డయేరియాపై అవగాహన అవసరం

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో డయేరియాపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఏఎన్ఎం హేమలత, ఆశా కార్యకర్త మదాబత్తుల స్వాతి ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఎవరికైనా వాంతులు, విరోచనాలు అయితే ఉపాధ్యాయులు వెంటనే ఆరోగ్య కేంద్రాల్లో సమాచారం అందించాలని కోరారు. డయేరియాను ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని సదుపాయాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్నాయన్నారు. ఆరోగ్య నియమాలు పాటిస్తూ రెండు పూటలా స్నానం చేయడం, చేతిగోళ్లు కత్తిరించుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం మంచిదన్నారు. అలాగే ప్రపంచ క్రీడా దినోత్సవం, పాత్రికేయుల దినోత్సవం గురించి ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు వివరించారు. క్రీడాకారులు, జర్నలిస్టులు సమాజానికి మిత్రులని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మవారిని మంగళవారం జాజులు, తులసి మాలలు, గజమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అలంకరణకు నందిక లక్ష్మణరావు, ఆదిలక్ష్మి దంపతులు సహకారం అందించారు. భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు, సంతపేటకు చెందిన దుంప శంకరరావు అమ్మవారిని అలంకరించారు.

● భీమిలి మండలం మజ్జివలస రాస పోలమాంబ అమ్మవారిని మల్లె, గన్నేరు, బంతి, డిశంబరు, లిల్లీ పువ్వులు, తులసి మాలలతో అలంకరించారు. ఈ అలంకరణకు తాటితూరు పంచాయతీ కాగితాలపేటకు చెందిన కాగితాల రాజు, నారాయణరెడ్డి, హిమదేవి దంపతులు సహకారం అందించారు. మజ్జివలసకు చెందిన తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు.


అలంకరణలో సంతపేట కొత్తమ్మ


అలంకరణలో మజ్జివలస రాస పోలమాంబ

కనులపండువగా శివ పార్వతుల తిరువీధి


హోమం వద్ద ద్రవ్యాలు, ఇతర పూజా సామగ్రితో కమిటీ సభ్యులు


అన్న సమారాధనను ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

మధురవాడ : మధురవాడ ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల మానం ఆంజనేయులు కాలనీలో వెలసిన శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వర స్వామి ఆలయ 5వ వార్షికోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. మూడు రాజులపాటు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించిన వేడుకల్లో ఆధ్యాత్మిక, ఆరాధన కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. ఉదయం నుంచే మహా కామేశ్వర స్వామికి పంచామృత సుగంధ, నారికేళ, పండ్ల రసాలుతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పువ్వులు, పత్రాలతో పూజలు చేసి సుందరంగా అలంకరించారు. శ్రీ చక్రం సమేత లలితా త్రిపుర సుందరీ దేవికి, పంచముఖ ఆంజనేయ స్వామి, భద్రాద్రి సీతారాముల స్వాములకు వేర్వేరుగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో లోక కళ్యాణార్థం హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ ధర్మకర్త బొడ్డేపల్లి సురేష్, కమిటీ సభ్యులు ప్రతాపరాజు, సీహెచ్‌వై నాయుడు, జేడీ నాయుడు అన్న సంతర్పణను ప్రారంభించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను మేళ తాళాలు, కోలాటంతో ఊరేగించారు. కేవీ రావు, సోమేశ్వరరావు, సింహాచలం, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం


ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి

భీమునిపట్నం : భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.విష్ణుమూర్తి మంగళవారం తెలిపారు. ఇక్కడ బీఏ, బీకాం, బీఎస్సీతోపాటు ఈ సంవత్సరం ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ కూడా అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. బీఏ హిస్టరీ, పొలిటికల్ సైన్స్‌లో 40 చొప్పున సీట్లు ఉన్నాయని, బీఎస్సీ సీఏఎస్‌లో 60 సీట్లు, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీలో 40 చొప్పున సీట్లు ఉన్నాయని, ఎమ్మెస్సీలో 30 సీట్లు ఉన్నాయని తెలిపారు. వీటిల్లో చేరాలనుకునే వారు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 10 వరకు అడ్మిషన్లు పొందవచ్చని, ఇతర వివరాలకు 9246639197, 9989937370లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా కాశీవిశ్వేశ్వర ఆలయ వార్షికోత్సవాలు

తగరపువలస : భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ గొల్లలపాలెంలోని శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ రెండో వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు ప్రత్యేక పూజలతో ప్రారంభమైన వేడుకలు 9 గంటలకు ప్రధాన అర్చకులు ఏడిద వివేకానందశర్మ, కార్తీక శర్మలు పార్వతీ పరమేశ్వరులకు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం పార్వతీ పరమేశ్వరులకు పల్లకీసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం, తప్పెటగుళ్లు, బాణసంచా ఏర్పాటు చేశారు. వేడుకల్లో సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమ, సన్యాసిరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, కోరాడ సూరిబాబు పాల్గొన్నారు.


పార్వతీ పరమేశ్వరుల కల్యాణ వేడుకలో భక్తులు

ఛాత్రోపాధ్యాయులకు నగదు బహుమతి

భీమునిపట్నం : స్థానిక జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్)లో ముగ్గురు ఛాత్రోపాధ్యాయులకు నగదు బహుమతులు మంగళవారం అందించారు. రెండు సెమిస్టర్ పబ్లిక్ పరీక్షల్లో రొంగలి శ్యామల ఎక్కువ మార్కులు సాధించగా హరిప్రియ, సమీర బాల తర్వాత స్థానాల్లో నిలిచారు. వీరికి అధ్యాపకురాలు జె.మాధవి తన తరపున శ్యామలకు రూ.వెయ్యి, హరిప్రియ, సమీరబాలకు రూ.800 చొప్పున నగదు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి మాట్లాడుతూ చక్కగా చదివి ఎక్కువ మార్కులు సాధిస్తే భవిష్యత్ బాగుంటుందని తెలిపారు. ఇతర ఛాత్రోపాధ్యాయులంతా వీరిని స్ఫూర్తిగా తీసుకుని బాగా చదవాలని కోరారు. అధ్యాపకులు ఎల్.సుధాకర్, జి.జి.ఎస్.నాగేశ్వరరావు, ఎస్.త్రినాథరావు, జి.రవి పాల్గొన్నారు.


నగదు బహుమతి అందిస్తున్న అధ్యాపకురాలు మాధవి, తదితరులు

శ్మశానవాటికలో పరిశుభ్రతా చర్యలు


శ్మశానవాటికలో తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

కొమ్మాది : జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది గ్రామంలోని శ్మశానవాటికలో మంగళవారం తుప్పలు, వ్యర్థాలు తొలగించారు. వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి లక్ష్మీ ప్రియాంక ఆదేశాల మేరకు జీవీఎంసీ అధికారులు స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలకు తుప్పలు పెద్దవిగా పెరిగిపోవడంతో స్థానిక నాయకుడు సియాద్రి కనకరాజు ఫిర్యాదు చేశారు. దీంతో పొక్లెయిన్‌తో తొలగించారు.

సీనియర్ ఉద్యోగులే మార్గదర్శకులు

తగరపువలస : సీనియర్ ఉద్యోగులను మార్గదర్శకంగా తీసుకుని ప్రస్తుత ఉద్యోగులు పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు సూచించారు. ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య పర్యవేక్షకురాలిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన రాఘవకుమారిని మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పూర్వ ఉద్యోగులు కష్టపడి చిత్తశుద్ధితో పనిచేసేవారన్నారు. వారి పనితీరుతో ఉన్నతోద్యోగులు మన్ననలు పొందేవారన్నారు. అలాంటి ఉద్యోగుల నుంచి ఇప్పటి తరం ఎంతో నేర్చుకోవాలన్నారు. సన్మాన కార్యక్రమంలో రాఘవకుమారి సోదరి, సినీనటి అలపాటి లక్ష్మి, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, రేవిడి పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాస్, జిల్లా కేంద్ర ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం, ఆరోగ్య పర్యవేక్షకులు పార్వతమ్మ, కృష్ణమోహన్, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


పీహెచ్‌సీ ఆరోగ్య పర్యవేక్షకురాలు రాఘవకుమారి సన్మాన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జగదీశ్వరరావు, తదితరులు

ఘనంగా జట్లమ్మ ఉత్సవం

పద్మనాభం : మండలంలోని రేవిడి గ్రామంలో మంగళవారం జట్లమ్మ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. రేవిడి, రౌతులపాలెం, అన్నంపేట గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాలు విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందాయి. జట్లమ్మ ఆటో స్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహించారు.


రేవిడిలో జట్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ప్రైవేటు కళాశాలలో విద్యార్థికి వేధింపులు

తగరపువలస : ఆనందపురం మండలం గంభీరం పంచాయతీలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఒక ప్రైవేట్ విద్యా సంస్థలోని జూనియర్ విద్యార్థిని కొందరు సీనియర్ విద్యార్థులు ఇటీవల వేధింపులకు గురి చేసినట్టు తెలిసింది. దీంతో మండలంలోని ముచ్చర్ల పంచాయతీకి చెందిన బాధిత విద్యార్థి కళాశాలకు వెళ్లనంటూ భీష్మించుకుని ఇంట్లో కూర్చోవడంతో తల్లిదండ్రులు మంగళవారం యాజమాన్యం దృష్టికి సమస్య తీసుకెళ్లారు. వెంటనే మేలుకున్న యాజమాన్యం విచారించి కళాశాలలో ర్యాగింగ్ జరగలేదని, విద్యార్థుల మధ్య కొట్లాట జరిగినట్టు తల్లిదండ్రులకు చెప్పినట్టు తెలిసింది. ఈ విషయం బయటకు రాకుండా కళాశాల యాజమాన్యం బాధిత విద్యార్థి తల్లిదండ్రులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

శిక్షణ విజయవంతానికి సహకారం

మధురవాడ: విద్యార్థులు తాము చదువుతున్న వివిధ అంశాలపై పట్టు సాధించి, ఇక్కడ శిక్షణ సక్రమంగా పూర్తి చేసుకోవాలని జీవీఎంసీ వెటర్నరీ ఆఫీసర్ కిషోర్ సూచించారు. శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలోని గన్నవరం వెటర్నరీ కళాశాలకు చెందిన విద్యార్థులు జీవీఎంసీకి 4 రోజుల ఇంటర్న్‌షిప్ కోసం మంగళవారం వచ్చారు. శిక్షణలో భాగంగా విచ్చేసిన విద్యార్థులకు మధురవాడ జోనల్ కార్యాలయంలో ఆయన పలు సూచనలు చేశారు. శిక్షణ దిగ్విజయంగా పూర్తి చేసుకోవడానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న వెటర్నరీ ఆఫీసర్ కిషోర్

మెగా క్రికెట్ టోర్నీ విజేత బాల్ బర్నర్స్


అమనాం బాల్ బర్నర్స్ జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి అందిస్తున్న దివీస్ ఎండీ మురళీకృష్ణ

తగరపువలస : భీమిలి మండలం మూలకుద్దులో 34 రోజులపాటు నిర్వహించిన దివీస్ ఛాలెంజర్స్ మెగా క్రికెట్ టోర్నమెంట్ విజేతగా అమనాంకు చెందిన బాల్ బర్నర్స్ జట్టు నిలిచి ట్రోఫీతోపాటు రూ.50 వేల నగదు బహుమతి గెలుచుకుంది. రన్నర్స్‌గా చిప్పాడకు చెందిన కూల్ థంపర్స్ జట్టు ట్రోఫీ, రూ.25 వేల నగదు బహుమతి గెలుచుకుంది. వీరికి మంగళవారం సాయంత్రం దివీస్ ఎండీ మురళీకృష్ణ దివి, భీమిలి సీఐ డి.రమేష్, సంస్థ ఈడీ ఎన్వీ రమణ, జనరల్ మేనేజర్ వైఎస్ కోటీశ్వరరావు, ఏజీఎం ప్రభాకర్, మేనేజర్లు డి.సురేష్ కుమార్, ఎ.శ్రీనివాస్, శేఖర్‌బాబు, కె.నరసింహ, పైడినాయుడు, తదితరులు నగదు బహుమతులు, ట్రోఫీలు అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 12 పంచాయతీల నుంచి మొత్తం 32 జట్లు పాల్గొన్నాయని తెలిపారు. వీటిలో నాలుగు జట్లు వంతున ఎనిమిది గ్రూపులుగా లీగ్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు రూ.25 లక్షలు ఖర్చు చేశామన్నారు. దివీస్ చుట్టుపక్కల గ్రామాల్లోని యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి తరచూ క్రీడలకు ప్రోత్సాహం అందిస్తున్నట్టు తెలిపారు.

ప్రతీ సోమవారం సచివాలయాల్లోనూ పీజీఆర్ఎస్

మధురవాడ : జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 పరిధిలో ఉన్న 5 నుంచి 13 వరకు గల వార్డుల్లోని అన్ని సచివాలయాల్లో ప్రతీ సోమవారం సాయంత్రం 3 గంటల నుంచి 5 వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ శైలజా వల్లి చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జోనల్ కార్యాలయంలో ప్రతీ సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పీజీఆర్ఎస్ నిర్వహిస్తామన్నారు. సచివాలయాల్లో స్వీకరించిన ఫిర్యాదులకు నిర్ణీత వ్యవధిలో పరిష్కార సమాచారం తెలియజేస్తారన్నారు. ఫిర్యాదుదారులు, స్థానిక, ప్రాంతీయ, పౌర సమస్యలను సంబంధిత సచివాలయంలో ప్రజా ఫిర్యాదు నమోదు చేసుకుని రసీదు పొందవచ్చని తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. జోన్ – 2 పరిధిలో ప్రజలు సంబంధిత విభాగాల అధికారులకు ఫోన్ చేసి సమస్యలు తెలియజేస్తే పరిష్కరిస్తారన్నారు. అధికారులు స్పందించకుంటే జోనల్ కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయాలని జెడ్సీ శైలజావల్లి సూచించారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో చోరీపై కేసు

పీఎం పాలెం : జీవీఎంసీ 6వ వార్డులో గల కొమ్మాదిలోని జిల్లా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో చోరీపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి జాన్ గ్యాలియేట్ నగరంలోని కిల్లంపూడి లే అవుట్‌లోని అపార్టుమెంటులో నివసిస్తున్నారు. కొమ్మదిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ తలుపులకు వేసిన తాళాలు బద్దలు కొట్టి ఉన్నాయని స్థానిక సిబ్బంది గమనించి ఆమెకు గత నెల 30న సాయంత్రం సమాచారం అందించారు.

ఆమె వెళ్లి పరిశీలించగా గదుల్లోని సామగ్రి చిందరవందరగా ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ముమ్మరంగా వాహనదారుల తనిఖీ


కారుషెడ్ కూడలిలో తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పీఎం పాలెం : మద్యం సేవించి ద్విచక వాహనాలపై ప్రయాణిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విశాఖ నార్త్ జోన్ సీఐ ఎస్.కాంతారావు హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం కారుషెడ్ కూడలిలో డ్రంకన్ డ్రైవ్ తనీఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నార్త్ జోన్ పరిధిలో గల రహదారుల్లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు అధికంగా నిర్వహిస్తున్నామన్నారు. మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడిపే వారు పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకోలేరన్నారు. వేలాది రూపాయలు జరిమానా చెల్లించడంతోపాటు జైలు శిక్ష అనుభవించాల్సి వుంటుందని ఆయన హెచ్చరించారు. తనిఖీల్లో స్థానిక సీఐ వెంకటరావు పాల్గొన్నారు.